# కుంభ వృష్టి..

## వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం

## పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

## ప్రాజెక్టులోకి భారీగా చేరిన వరద నీరు

**వికారాబాద్, ఆగస్టు 31(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షం కురవడంతో వాగులు , వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలోని కాగ్న, కాకర వేణి వాగులు వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వికారాబాద్ పట్టణానికి సమీపంలోని కొత్తగాడి రైల్వే వంతెన వద్ద భారీగా వరద నీరు చేరడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల శివారులోని అయ్యాలం వాగు పొంగి ప్రవహించడంతో తాండూరు నుంచి కురుగుంట మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తాండూరు ఆర్టీసీ డిపో నుంచి సిడం కు శనివారం ఉదయం బయలుదేరి వెళ్లిన బస్సు వాగులు పొంగడంతో తిరిగి తాండూర్ కు చేరుకుంది. భారీ వర్షాలు కురవడంతో జిల్లాలోని చెరువుల్లో ,కుంటల్లోకి , భారీగా వరద నీరు వచ్చి చేరింది. జిల్లాలోని కోటపల్లి ప్రాజెక్ట్ , శివ సాగర్, సర్పన్ పల్లి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటన తెలిపారు. శనివారం జిల్లా లో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు , మున్సిపల్ కమిషనర్లు అందరు అప్రమత్తం గా ఉండాలని ,ఎడతెరపి లేని వర్షాలు, గ్రామాలు, జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయని, రానున్న రెండు మూడు రోజులు సైతం వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించినందున ఎక్కడ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో పాతబడిన మిద్దెలు ఉండి శిధిలావస్థకు చేరుకొని ఉంటే అలాంటి వాటిని గుర్తించి వెంటనే అందులోనుంచి కుటుంబాలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, మురుగు కాలువలు అన్ని శుభ్రం చేయించాలని ఎక్కడ కాలువలు నిండిపోయి ఓవర్ఫ్లో కాకుండా చూసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంటుంది కాబట్టి పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా పంట నష్టం జరిగితే వెంటనే నివేదిక సిద్ధం చేసి పంపించెందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్దంగా ఉండాలని తెలిపారు. విద్యుత్ సమస్య లేకుండా చూసుకోవాలని, పాతబడి కుంగిపోయిన విద్యుత్ స్తంభాలు ఉంటే వెంటనే మార్చాలని, వైర్లు కిందికి వేలాడకుండ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎక్కడైనా ఏవైనా సమస్య ఉత్పన్నం అయితే వెంటనే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలని. కలెక్టరెట్ కార్యాలయం 8416242136 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచార మివ్వాలని సూచించారు. జిల్లా ఎస్పీతో కలిసి జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు.రానున్న మూడు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని, భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, ముందస్తు గా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.







# ఊరిస్తున్న 'డబుల్' పంపిణీ

## మేడ్చల్‌లో లబ్ధిదారులకు అందని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

## పంపిణీకి ముందే శిథిలావస్థకు చేరుకున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

## ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని ప్రజల డిమాండ్

**మేడ్చల్, ఆగస్టు 31(ప్రజాస్వరం) :**

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కల మేడ్చల్ పట్టణ పేదలకు అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా వాటిని అర్హులకు అందజేయడంలో ఆలస్యం చేస్తున్న అధికారుల తీరుపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇల్లు లేని నిరుపేదలు లేకుండా చేయాలని అర్హులైన ప్రతి నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రభుత్వమే పంపిణీ చేస్తుందని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తామే నిర్మించి పూర్తి సౌకర్యాలతో కూడిన కాలనీలను ఏర్పాటు చేసి ప్రజలకు పంపిణీ చేయాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ కల. అనుకున్నదే తడవుగా గత ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టింది. కానీ నిర్మాణాలు పూర్తయిన వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో ఆలస్యం జరిగింది. లాటరీ పద్ధతిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించిన అధికారులు అర్హులైన వారికి వాటిని ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడంతో సదరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు శిథిలావస్థలోకి చేరుకున్నాయి. సదరు ఇళ్లు చిట్టడవులను తలపిస్తూ దర్శనమిస్తున్నాయి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ఏర్పాటు చేసిన తలుపులు, కిటికీలు అధ్వాహ్నంగా మారాయి. లబ్దిదారుల ఎంపిక దాదాపు పూర్తయిన వారికి అందజేయడంలో ఎందుకు అలసత్వం చేస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు స్థానికులు అధికారుల తీరును తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు నిర్మించిన 80 డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇప్పటికైనా కేటాయించాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.



**వెంటనే పంపిణీ చేపట్టాలి..**

**పేదల కోసం నిర్మించిన ఇళ్లను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలి. చాలా మంది ఇంటి అద్దెలు చెల్లించలేని స్థితిలో ఉన్నారు. అధికారులు స్పందించి వెంటనే నిరుపేదలకు న్యాయం చేయాలి.**

**- బి. దర్శన్**



# హైడ్రాకు ఫిర్యాదు చేస్తా

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్**



**మేడ్చల్, ఆగస్టు 31 (ప్రజాస్వరం) :**

ఘట్కేసర్ మండలం, వెంకటాపూర్ లోని నాడెం చెరువు తూంను రాత్రికి రాత్రే ధ్వసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ డిమాండ్ చేశారు. నాడెం చెరువును శనివారం సందర్శించిన అయన మాట్లాడుతూ... నాడెం చెరువు కబ్జా చేసిన వారే తూంలను ధ్వసం చేశారని. దీని వల్లన ఎఫ్ టీఎల్ పరిధి తగ్గించాలనే దురుద్దేశంతో కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై హైడ్రా కమిషనర్ కు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక జీవో లతో రోడ్డును కుదించారాని ఆరోపించారు. తూము ధ్వసం చేసిన వారిపై. రోడ్డు ఇరుకు చేసిన వారి పై చర్యలు ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల అధ్యక్షుడు కర్రె రాజేష్, మండల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలున్నారు.

# చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**మేడ్చల్ జోన్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి**




**మేడ్చల్, ఆగస్టు 31 (ప్రజాస్వరం) :**

ఇంటర్మీడియట్ వయసులో విద్యార్థులు త్వరగా చెడుకు ప్రభావితం ప్రమాదం ఉందని ఏది మంచి ఏది చెడు అని గుర్తించాలని ప్రతి విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యసాధన కోసం ప్రతిరోజు కృషి చేయాలని మేడ్చల్ జోన్ ఏసీపీ బి. శ్రీనివాసరెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓం శివ సాయి ఫంక్షన్ హాల్ లో స్ఫూర్తి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉందని దీంట్లో మంచి... చెడు రెండు ఉన్నాయని అన్నారు. ఫేస్ బుక్, ఇంస్టాగ్రామ్, వాట్సాప్ లలో పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో కళాశాలకు పంపిస్తున్నారని వారి ఆశలను నెరవేర్చేందుకు అనుక్షణం పట్టుదలతో ముందుకు సాగాలని తెలిపారు. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని ఎటువంటి నేరం చేసినా నేరం చేసేవారికి సహాయం చేసినా శిక్ష పడుతుందని హెచ్చరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, రచయిత డాక్టర్ మావుదూరి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే విద్యార్థులు ఇంటర్మీడియట్ లోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని తెలిపారు. భారతదేశ ఔన్నత్యం ఎంతో గొప్పదని ప్రతి విద్యార్థికి దేశం పట్ల అభిమానం, తల్లిదండ్రులు, గురువులపై గౌరవం సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నేతి సమాజంలో అమ్మాయిలపై జరుగుతున్న ఆకృత్యాలను చూపిస్తూ ప్రదర్శించిన నాటక ప్రదర్శన విద్యార్థులను ఆలోచింపచేసే విధంగా సాగింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మార్పులను సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ముఖ్య అతిథి ఏసిపి బి శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అతిధి సూర్యనారాయణ మూర్తిలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సిఐ ఏ సత్యనారాయణ, కళాశాల కరస్పాండెంట్ కమలాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ దేవరాజ్ , యాజమాన్య సభ్యులు గణేష్, సత్యనారాయణ, అధ్యాపకులు, యాజమాన్య సభ్యులు మంజుల ప్రకాష్, రామ్ శంకర్ పేర్లను కూడా దయచేసి రాయగలరు.విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.






# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సునిషితత్వాన్ని కలిగి ఉండాలి

**వికారాబాద్, ఆగస్టు 31 (ప్రజా స్వరం) :**

తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు 33 మంది వికారాబాద్ లో జరుగుతున్న అటవీ శాఖ పనులను శనివారం అనంతగిరి ప్రాంతాన్ని వారి శిక్షణలో భాగంగా సందర్శించారు . ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కోర్స్ డైరెక్టర్ గంగారెడ్డి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అటవీ సంరక్షణలో భాగంగా అత్యంత సునిషితత్వాన్ని కలిగి ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల లో అటవీ సంరక్షణ సంక్లిష్టంగా మారిన దృశ్య ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అటవీ సంరక్షణ ఒక సోషల్ వర్క్ లాంటిదని కాబట్టి సమాజంలోని అందరినీ కలుపుకుపోతూ అడవులను సంరక్షించాలని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ శ్యాం కుమార్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీమతి అరుణ ఇతర ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999